## కథ

బద్దిగం పాండురంగారెడ్డి

# వాస్తు...వాస్తు!

**రాంబ్రహ్మానికి వెనకా ముందూ పెద్దగా ఎవరూ లేరు. అయితే రాంబ్రహ్మానికి మంచి ఉద్యోగం ఉంది. తండ్రి కట్టి వెళ్ళిపోయిన మంచి ఇల్లుంది. రాంబ్రహ్మానికి వండి పెట్టడానికా అన్నట్లు వయసు మళ్ళి, ఎప్పుడూ గొణుక్కునే అమ్మ ఉంది.**

ఆవిడ అస్తమానం గొణిగే సణుగుళ్ళలో అధికభాగం తననీ చెర (చాకిరీ) నుండి తప్పించరా అని. ముందురోజుల్లో రాంబ్రహ్మానికి దీని గూడార్థం సరిగా తెలిసిరాక అమ్మ అట్లా విసుక్కున్నప్పుడల్లా 'రేపో మాపో పనిపిల్లనో'దాన్ని మాట్లాడ్తాలే' అని చిందులాడేవాడు. అమ్మ చికాకు మరచిపోయి నవ్వేది. రాను రాను రామబ్రహ్మానికి అమ్మ అనే మాటల్లోని గూడార్థం తెలిసొచ్చింది. తెలిసింతర్వాత దిగులుపడ్డాడు.

రాంబ్రహ్మం ఆఫీసులోనే పనిచేసే శంకర్రావనే వేటకుక్కలాంటి స్నేహితుడున్నాడు. రాంబ్రహ్మానికి ప్రాణానికి ప్రాణం. శంకర్రావుకు సాధారణంగా తెలీని విషయాలంటూ ఏమీ లేవు. ముఖ్యంగా శంకర్రావు 'వాస్తు శాస్త్రం'లో బాగా కృషిచేశాడు. శంకర్రావుకు విజయవాడలో ఈ 'శాస్త్రం'లో ఓ గురువు కూడా ఉన్నాడు. తన సందేహాలకు అడపాదడపా గురువుగారి వద్దకెళ్ళి తీర్చుకుని తృప్తిపడుతూ ఉంటాడు. వీధిలో నడుస్తున్నప్పుడు శంకర్రావు ప్రతి ఇంటినీ..పరిసరాలనీ... కాంపౌండు గోడల్నీ, బావుల్నీ... పోలీసు కుక్కలు నేరస్థుడ్ని చూసినట్లు చూసి లెక్కలు కట్టుకుంటాడు.

రాంబ్రహ్మం శంకర్రావు 'వాస్తుశాస్త్రం' గురించి తనకు వివరించబోయినపుడల్లా చికాకు పడతాడు. అయినా తనకు అంతకుమించిన మంచి ఆప్తుడు లేకపోబట్టీ... తను తప్ప శంకర్రావుకు మరో శ్రోతలేడు కాబట్టి తప్పనిసరిగా 'ఊ'కొడతాడు.

అట్లాంటి పరిస్థితుల్లో రాంబ్రహ్మాన్ని ఎరిగున్న పొరుగూరి పెద్దమనిషి ఓ సంబంధం గురించి మిక్కిలి శ్రద్ధ తీసుకుని ఆ సదరు 'సంబంధం' గురించిన సమాచారం చేరవేశాడు. విషయం విని ఎక్కువగా సంతోషించింది రాంబ్రహ్మం తల్లి.

''మా నాయనే పోయి పిల్లను చూసిరా తండ్రీ- నువు చూసి 'ఊ' అంటే మూడుముళ్ళూ పడితే ముచ్చటగా ఈ రెండు కండ్లా చూసి తరిస్తానురా''

ఆవిడ మాటల్లో ప్రార్ధనకన్నా దైన్యం-దాంతోపాటు మిగిలిపోయిన ఒకే ఒక కోరికా కనిపించి రాంబ్రహ్మం హృదయం కరిగిపోయింది.

''ఛా..ఛా..నువ్వేం దిగులుపడకమ్మా. నేనున్నానుగా. మనవాడున్నాడుగా. అయినా వాడికేం తక్కువని? వాడ్ని నలిపి నలభై ఊళ్ళకు దీపం పెట్టొచ్చు.''

''అసలీపాటికి వీడ్ని, వీడి ఉద్యోగాన్ని చూసి తెట్టులేచిన తేనెటీగల్లా ఇంటిచుట్టూ గుంపు ముసరకపోవటం నాకు మట్టుకు నాకు వింతగా ఉంది. కారణం తెలీదు'' శంకర్రావు మాటలాపి ఇంటి గోడల్నీ, పై కప్పునీ పరిశీలించడం చూసి రాంబ్రహ్మం హడలిపోయాడు.

''ఒరేయ్ ఒరేయ్! నీ మాటలకేంగానీ నువ్వే నా పెళ్ళి పెత్తనం భుజానేసుకుని నీ ఇష్టం వచ్చినట్లు కానీ, నేను వద్దన్నానా? నీ ఇష్టం.''

**రాంబ్రహ్మం పెద్ద విస్ఫోటం జరిగినట్లు, ప్రళయం వచ్చేముందు భూమి కంపించినట్లు కంపించాడు. అడిగినతను అమ్మాయికి దూరపుబంధువు. వీలయితే తన దవడ పళ్ళమధ్య ఇరికించి కరకర నమిలేయాలన్నంత కోపం వచ్చింది. శంకర్రావుకు అదేం పట్టినట్లు లేదు. తనను అంత ఆప్యాయంగా అడిగిన శ్రోతకు తన శాస్త్ర పాండిత్యాన్ని గురించిన సమగ్ర సమాచారం అందిస్తున్నాడు.**

రాంబ్రహ్మం తల్లి పరమానందపడిపోయింది. మంచంలో నుండి లేచి రాంబ్రహ్మం బుగ్గలు పుణికింది. శంకర్రావు రాంబ్రహ్మాన్ని రెండు చమత్కారపు మాటలని వెళ్ళిపోయాడు.

తెలతెలవారుతుండగా రాంబ్రహ్మాన్ని పెళ్ళి చూపులకు బయల్దేరదీశాడు శంకర్రావు. త్రోవ పొడవునా గార్హస్త జీవితం గురించీ, పెళ్ళి ఎట్లా మధురమైనదో, తనకు ఎంత హుషారుగా గడిచిందో వివరించి, చివరన ''జన్మ ఎత్తినందుకుగాను, తల్లిదండ్రులు మనల్నో ఇంటివాళ్ళను చేసి, చూసి తరించాలనుకుంటారు కాబట్టి, వాళ్ళ సబబైన కోరికను తీర్చడం మన కనీస ధర్మం'' అని తన ఉపన్యాసం ముగించాడు.

''అరె నాకు మాత్రం పెళ్ళి చేసుకోవాలని లేదనుకున్నావుట్రా శంకరం. పెళ్ళో నాకు పెళ్ళి అంటే నలుగురు నవ్వేసి చులకన చేస్తారని ఊరుకున్నానుగాని, అసలింకెందుకు నీవంటి ఆత్మీయుడి వద్ద కూడా నా కోరిక బయట పెట్టలేదంటే అదే కారణవూనూ'' రాంబ్రహ్మం శంకర్రావుకు తన మనసులోని ఆలోచన తెలియజేశాడు.

శంకర్రావు బ్రహ్మానందపడిపోయాడు.

బస్సు దిగేసరికి అమ్మాయి తాలూకు పెద్దమనిషి సాదరంగా ఆహ్వానించి ఇంటికి తీసుకెళ్ళాడు. 'కొండొకచో' పొరపాటు జరగవచ్చని ముందే శంకర్రావు పిల్లతండ్రితో లాలూచీగా నవ్వి ''పెళ్ళి చూపులకు వచ్చింది రాంబ్రహ్మం'' అని రాంబ్రహ్మాన్ని చూపించాడు. ఆయన లౌక్యంగా నవ్వి ఊరుకోలేదు.

''మీరూ?'' అని అడిగాడు.

''నేను మావాడి సర్వస్వం! చూడండీ.. వాడున్నాడు. వాడికి కావలసినవారు అమ్మ తప్ప పెద్దగా ఎవరూ లేరు. నేను చాలా ఫ్రాంక్‌గా మాట్లాడేవాడ్ని. నేను గీత గీస్తే వాడు దాటడు. అసలంత అవసరమూ లేదనుకోండి.''

శంకర్రావు ధోరణికి వాళ్ళు ఆనందపడి కులాసాగా నవ్వేశారు. శంకర్రావు కూడా అక్కడి వాతావరణాన్ని అట్లా ఆహ్లాదకరంగా మార్చినందుకు పొంగిపోయి రెచ్చిపోయాడు. రాంబ్రహ్మం కూడా శంకర్రావును లోలోపలే మెచ్చుకున్నాడు- అట్లా మెచ్చుకుని ఊరుకుంటే బావుండదు గదా?!

''అవునండీ..కావడానికి వాడు స్నేహితుడే అయినా నాకు సర్వస్వమూ వాడేనండీ..అఫ్‌కోర్స్.. వాడికిష్టంలేని పని ఏదీ నేనింతవరకూ చేయలేదు. ఇక చేయను కూడా!''

అమ్మాయిని చూడడం అయిపోయింది.

అమ్మాయి ఎర్రగా ఉంది. కనుముక్కు తీరు

బావుంది. అందంగా ఉంది. రాంబ్రహ్మం మనసులోనే మార్కులు వేసుకుని తృప్తిపడి గుంభనంగా చూస్తూ ఊరుకున్నాడు.

''చూడండి శంకర్రావుగారూ! అమ్మాయి నచ్చితే ముహూర్తం పెట్టించుకోవచ్చు. ఇక పెద్దగా కట్నాలూ..కానుకలూ అంటే మాకు చాతకావు. అమ్మాయిని చదివించాం. తెలివిగలది. మంచీ, చెడూ తెలిసింది. అదీ సంగతి'' అన్నాడు అమ్మాయి తండ్రి.

శంకర్రావు ఆ విషయాన్ని మననం చేసుకుని ఊరుకుండిపోయాడు. అరచేత్తో గెడ్డాన్ని పలుమార్లు అటూ ఇటూ రుద్ది ఇంటినీ, గోడల్నీ పరిశీలిస్తూ కూర్చున్నాడు. రాంబ్రహ్మం శంకర్రావుని తాత్కాలికంగా వదిలేసి అమ్మాయిని మననం చేసుకుంటూ కూర్చున్నాడు.

శంకర్రావు ఒక్కసారే నిటారుగా లేచి గబగబా అందర్నీ తప్పించుకుంటూ దొడ్లోకి నడిచాడు. రాంబ్రహ్మం మొహం రంగుమారి 'ఖాయిలా' పడినవాడిలా, బేలగా చూస్తూ కూర్చున్నాడు. రెండు నిమిషాల తర్వాత శంకర్రావు నొసలు చిట్లిస్తూ దొడ్లోనుండి తిరిగి వచ్చాడు.

''లాభం లేదండీ..ఈశాన్య దిశలో ఉన్న మీ బావి పూడ్పించాలి. అది శాస్త్ర విరుద్ధంగా ఉంది. పెళ్ళయిం తర్వాత అబ్బాయికి దానివల్ల 'యమగండం' ఉంది మరి.''

వాళ్ళందరూ నోళ్ళు తెరుచుకుని చూస్తుండిపోయారు.


''అసంభవం'' పెళ్ళికూతురు తండ్రి తేరుకుని అన్నాడు. ''అతి కష్టంమీద నీళ్ళు పడిన బావది. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూడ్పించలేం. అదీగాక ఈ శాస్త్రం అంతా చాదస్తం- మా ఇంట్లో వాళ్ళందరూ భౌతికవాదులు..ఇలాంటి ట్రాష్ మేం నమ్మం.''

శంకర్రావు తన శాస్త్రాన్ని 'ట్రాష్' అన్న తర్వాత ఇంకా తీవ్రంగా మారిపోయాడు. అతన్ని ఆ విషయంలో ఎవరూ కంట్రోలు చేయలేరు. ఆ విషయం వాళ్ళకెవరికీ తెలియదు.

శంకర్రావు వెంట బిక్కుబిక్కుమంటూ రాంబ్రహ్మం బయటకు రాక తప్పలేదు.

''శంకరం! మనం తొందరపడుతున్నామేమో?''

''నువ్వు నోర్ముయ్! ఆడపిల్లవాళ్ళు అంత 'బిర్రు' చూపిన తర్వాత మనమేనా లొంగేది. అందులోనూ శాస్త్ర విషయంలో! మనం కట్నం కానుకలు ఇమ్మని అడగలేదుగా! కేవలం




కోరింది ఒకటే ఒక కోరిక. అదయినా ఎవరి మేలు కోరి? వాళ్ళ అమ్మాయి వెంటనే హఠాత్తుగా విధవ కావటం వాళ్ళకి మంచిదా? పోనీ నువ్వు ఒప్పుకుంటావా?''

లేదన్నట్లు రాంబ్రహ్మం దిగులుగా తలూపాడు.

ఆ విధంగా రాంబ్రహ్మం మొదటి పెళ్ళి చూపుల తంతు ముగిసింది.

తరువాత రెండుసార్లు పెళ్ళి చూపుల తంతు జరిగిన తర్వాత శంకర్రావంటే రాంబ్రహ్మం దడుచుకునే స్థితికి వచ్చాడు. ఆ కారణంగా పెళ్ళన్నా, పెళ్ళికూతుళ్ళన్నా అదో



ఏహ్యభావం, జుగుప్సా అనుకోకుండానే మొదలయ్యాయి. ఎక్కడన్నా పెళ్ళి సన్నాయి వినబడితే లోలోపలే మండిపడేవాడు.

ఓసారి-

రాంబ్రహ్మం శంకర్రావును ముందే హెచ్చరించాడు. ముందురోజుల్లో బ్రతిమిలాడేవాడు!

''నేను మాత్రం శాస్త్ర విరుద్ధంగా ఏం మాట్లాడాను? నీ పిచ్చిగానీ అంత తెలివి తక్కువవాడ్నా?''

శంకర్రావు నోటివెంట 'శాస్త్రం' అన్న పదం వింటే అక్కడే రోడ్డు మీద వాడికి సాగిలపడి ఆ మాట అనవద్దని బ్రతిమలాడాలని కూడా అనుకున్నాడు.

మామూలుగా రాంబ్రహ్మం అమ్మాయిని చూశాడు. ఈ అమ్మాయితో అయింది, కాకపోతే ఇంకామాట తలపెట్టొద్దనుకున్నాడు కూడా.

అమ్మాయిని చూడటం, కుశల ప్రశ్నలూ అయిపోయాయి. సిగరెట్లు వెలిగించుకుని మాట్లాడుకుంటూ కూర్చున్నారు.

''అన్నట్లు శంకర్రావుగారూ! మీరు వాస్తుశాస్త్రంలో మాంచి దిట్ట అని విన్నాను.''

రాంబ్రహ్మం పెద్ద విస్ఫోటం జరిగినట్లు, ప్రళయం వచ్చే ముందు భూమి కంపించినట్లు కంపించాడు. అడిగినతను అమ్మాయికి దూరపుబంధువు. వీలయితే తన దవడ పళ్ళమధ్య ఇరికించి కరకర నమిలేయాలన్నంత కోపం వచ్చింది. శంకర్రావుకు అదేం పట్టినట్లు లేదు. తనను అంత ఆప్యాయంగా అడిగిన శ్రోతకు తన శాస్త్ర పాండిత్యాన్ని గురించిన సమగ్ర సమాచారం అందిస్తున్నాడు.

''శాస్త్రం శాస్త్రమేనండీ! నాదేముందీ ఏదో కృషి. కాని కొందరు మూర్ఖులు దీనిని నమ్మరు. ఐ డోంట్ కేర్. నమ్మనివాడ్ని నేనేం లెక్కచేయను. అసలు మనం నివసించే పరిసరాల ప్రభావం మనమీద లేదన్నవాడి చెమ్డాల్తీసేయాలంటాను నేను.''

రాంబ్రహ్మానికి నోరంతా చేదుగా మారిపోయింది.

''ఉదాహరణకు ఈ కుర్చీ చూడండి- ఇది ఆగ్నేయానికి మొహం చాచి వుంది. అది శాస్త్ర విరుద్ధం. కొండొకచో చెడు. అసలు శాస్త్రం క్లుప్తంగా చదవాలి మరి.''

శంకర్రావు కొంచెం ఉపన్యాసమిచ్చి శ్రోతల్ని మరిచిపోయి మడత కుర్చీలో ఆయాసంగా కూలబడ్డాడు. దాని కర్ర బలహీనంగా వుంది కాబోలు, పెటేల్మని విరగడం, శంకర్రావు నడ్డి విరిగినంత పనయి కుర్చీలో ఇరుక్కుపోవడం రాంబ్రహ్మానికి అన్నిటికన్నా చిరాకు కలిగించాయి.

నలుగురు కుర్చీలోనుండి లాగుతూన్నా రాంబ్రహ్మం మాత్రం క్రుద్ధుడవుతూ అలాగే కూర్చుండిపోయాడు.

ఆ సంబంధం ఒప్పుకోలేదు రాంబ్రహ్మం.

★ ★ ★

హఠాత్తుగా రాంబ్రహ్మానికి పెళ్ళయిపోయింది.

శోభనం రోజు-

''మాలతీ!'' గోముగా భార్యని నిమిరాడు రాంబ్రహ్మం.

''ఊ!''

ఏం మాట్లాడాలో తెలీక భార్యని ప్రేమగా చూస్తూ కూర్చున్నాడు రాంబ్రహ్మం.

''అన్నట్లు మీరు చాలామందిని చూసి నన్ను చేసుకున్నారటగా?''

''ఊ!''

''ఎందుకో?''

''ఎందుకేమిటి? ఇష్టంలేక- ఇంకా ఇతర కారణాలు!''

''అబ్బో! ఏం కారణాలో, అందమా?''

''నోనో.. అదేం కాదు. అసలు శంకర్రావుని, అంటే నా ఫ్రెండు నాతో పెళ్ళిచూపులకు వచ్చేవాడు. అఫ్‌కోర్స్.. నిన్ను చూడటానికి వచ్చినప్పుడు వాడు వాళ్ళ ఊరెళ్ళాడు. అహ- అదేం లేదులే!'' రాంబ్రహ్మం ఊపిరి తీసుకుని టాపిక్ మార్చేశాడు.

తెల్లారి-

''ఏవండోయ్! ఈ గుమ్మం వుంది చూశారూ?''

''ఊ!''

''ఇది నైఋతి కదండీ! వెనక పంపూ నైఋతికే. అది శాస్త్ర విరుద్ధం. రెండూ మార్పించాలి- ఇంకా ఈ రెండు కిటికీలు- ఆ సామాను గది-''

రాంబ్రహ్మానికి మూర్ఛవచ్చినంతపనయింది.

''అంటే..అంటే..?''

''వాస్తు శాస్త్రంలో నాకు బాగా ప్రవేశముందండీ! నాకిష్టమైన సబ్జెక్టది. అశాస్త్రీయంగా ఏదున్నా నేను భరించలేను..ఆ!''

## '9' సెంటిమెంట్!

**జూనియర్ ఎన్టీఆర్ సినీ కెరీర్‌ని అమాంతం మలుపు తిప్పి, అనేక రికార్డుల్ని బద్దలుకొట్టిన సినిమా 'సింహాద్రి'. ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్‌కి మళ్లీ ఆ రేంజ్ హిట్ దొరకలేదు. 2003, జూలై 9న 'సింహాద్రి' రిలీజ్ అయింది. బహుశా సెంటిమెంట్‌తోనే కాబోలు ఇప్పుడు రాజమౌళి-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో నిర్మాణమవుతున్న 'యమదొంగ' సినిమాని కూడా 2007 జూలై 9న విడుదల చేయాలని అనుకుంటున్నట్టు వినికిడి. సుమారు ఐదుగురు హీరోయిన్లతో ప్రముఖ తారలు గెస్టు పాత్రల్లో కనిపించే 'యమదొంగ' సినిమా ఎలాంటి విజయాన్ని సాధిస్తుందో చూడాలి!**